నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
మంగళవారం 19, మార్చి 2024 పేజీలు - 8

# పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి

### పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

### ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి పరీక్షా కేంద్రానికి పంపాలి

### సెల్‌ఫోన్లు అనుమతించవద్దు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు






చివ్వెంల, మేజర్‌న్యూస్ : పదవ తరగతి పరిక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ఎస్ వెంకట్రావు సోమవారం ఉదయం సూర్యాపేట పట్టణంలోని 60ఫీట్ల రోడ్డులో గల కాకతీయ హైస్కూల్, వివేక వాణి విద్యామందిర్ హైస్కూల్లో ఉన్న పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలు రాసే పిల్లలకు ప్రశాంత వాతావరణం కల్పించాలని, పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ తెలిపారు. మొబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రంలోనికి అనుమతి లేదని, ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తర్వాతే లోనికి పంపాలని, సెల్‌ఫోన్ అనుమతించవద్దని ఆదేశించారు. ఈ రోజు జరిగిన తెలుగు పరీక్షకు 11943 మంది విద్యార్ధులకు గాను 11904 మంది విద్యార్థులు హాజరయ్యారని, 39 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఆక స్మికంగా పరిశీలించిన కాకతీయ హైస్కూల్ నందు 140 విద్యార్థులకు గాను 139 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని ఛీఫ్ సూపరిటెం డెంట్ సిహెచ్ శ్రీహరి కలెక్టర్‌కి వివరించారు. అలాగే వివేకావాణి విద్యామందిర్ హైస్కూల్ నందు 180 మందికి గాను 180 మంది పరీక్షకు హాజరయ్యారని ఛీఫ్ సూపరింటెండెంట్ కలెక్టర్‌కి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఇంఛార్జీ ఎంఈవో శైలజ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# మోడీ అవతార పురుషుడు

### నల్గొండలో కాషాయ జెండా ఎగురావేస్తాం

### నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి ఎస్.సైదిరెడ్డి



నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గంలో కాషాయం జెండా ఎగురుతుంది అని నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో విలేఖర్లు సమావేశంలో అయన మాట్లాడుతూ మోడీ ఒక అవతార పురుషడు అని దేశంలో 400సీట్లు బీజేపీ పార్టీ కి వస్తాయ్ అని అయన అన్నారు. దేశంలో మోడీ అభివృద్ధి సంక్షేమ పథకాలే బీజేపీ పార్టీని గెల్పిస్తాయని ఆయన అన్నారు. దేశంలో ఒక్క పంచాయతీ లేకుండా రామాలయం కట్టమని పెద్ద పెద్ద రోడ్డు వేశామని అన్నారు. నేను బీజేపీలోకి రావటం నా అదృష్టంగా భావిస్తున్నాను నేను అనేక దేశాలు తిరిగాను కాబట్టి ఎక్కడకి ఏ దేశం నకు వెళ్లిన మోడీ మోడీ అంటున్నారు మోడీ ప్రభంజనం చూసి నేను బీజేపీ పార్టీలో చేరాను. ఏ నియోజకవర్గం వెళ్లిన బీజేపీ నాయకులు అక్కున చేర్చుకుంటాన్నారు. ఇక్కడ నల్గొండలో నాయకులు జిల్లా అధ్యక్షులు కూడ అక్కున చేర్చుకొని నల్గొండ పార్లమెంట్‌లో కాషాయం ఎగురు వేస్తామని అయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, నివేదిత రెడ్డి భూపాల్ రెడ్డి, రాజా శేఖర్ రెడ్డి, యాదగిరి, మీడియా కన్వినర్ గడ్డం మహేష్‌లు పాల్గొన్నారు.

# నరసింహుడు హనుమంత వాహన శేవపై భక్తులకు దర్శనం






యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ నరసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. నయన మనోహరంగా స్వామివారు అలంకార సేవపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు స్వామి వారు. లోక కల్యాణం కోసం స్వామి వారు వివిధ అవతారాలు ఎత్తారని అర్చకులు ఉపదేశించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారినిసర్వాంగసుందరంగాఅలంకరించారు. వేదమంత్రలు,వేదపారాయణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు సేవ పై ఊరేగారు. ఈ రోజు రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించినారు. సోమవారం వివిధ కైంకర్యాలలో వచ్చిన ఆదాయం 29,54,302. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు.



# వాహన తనీఖీల్లో పట్టుబడ్డ బంగారం విలువ 5 కోట్ల 73 లక్షలు : ఎస్పీ

వివరాలు 2లో


# రక్తమోడుతున్న రహదారులు



### ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేసిన పోలీసులు

పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : మండల వ్యాప్తంగా రహదారులు ప్రమాద ఘంటికలు మోగిస్తూ ప్రమాదాలతో రక్తమొడుతున్నాయి. మండలంలో ఉన్న ప్రధాన రహదారిపై అనేక ములమలుపులు, ప్రమాదాలు జరుగు స్థలాలు ఉన్నాయి వీటితో ఇటీవల సింగారెడ్డిపాలెం గ్రామశివారులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, దుపహాడ్ సమీపంలో మేదారం గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందారు. ఈ విధంగా నిత్యం మూలమలుపులలో వందల మంది ఏదో ఒక ప్రమాదాలతో ప్రాణాలు వదిలిన దాఖలాలు ఉన్నాయి. విషయము గమనించిన ఎస్ఐ పెరిక రవీందర్ మూలమలుపులలో వేగ నియంత్రికరణ ఉన్నచోట ప్రమాద హెచ్చరిక బోర్డులను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగంతో వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ దాసరి హరిచందన



నల్గొండ జిల్లా బ్యూరో: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన నల్గొండ జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరుపు పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ సెయింట్ అల్ఫన్సెస్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి వెళ్లి అక్కడ పరీక్షకు కేటాయించిన విద్యార్థులు, హాజరైన వారు. గైర్హాజరైన విద్యార్థుల వివరాలను పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపిరింటెండెంట్ కె. బాలరాజుతో అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ పరీక్ష కేంద్రంలో

మిగతా 2లో

# బీసీ కార్పోరేషన్ చైర్మన్‌ను కలసిని బెండ శ్రీకాంత్



భువనగిరి, మేజర్‌న్యూస్ ః ఇటీవల తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కార్పోరేషన్లకు చైర్మన్లను ప్రకటించినది. అందులో భాగంగా బీసీ కార్పోరేషన్‌కు నూతి శ్రీకాంత్ గౌడ్‌ను నియమించినది. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబిసి కో-అర్డినేటర్ బెండ శ్రీకాంత్ కలసి శూభాకాంక్షలు తెల్పారు. ఈ సందర్భంగా బెండ శ్రీకాంత్ మాటలాడుతు రాష్ట్రంలోని బీసీ అభ్యున్నతికి తమ వంతు కృషి చేయాలని కోరారు.

# స్వేచ్ఛ వాతావరణంలో పెరిగిన పిల్లలకు జ్ఞాపకశక్తి ఎక్కువ

## రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యులు పొనుగోటి అంజన్‌రావు వెల్లడి



నాంపల్లి మేజర్ న్యూస్ః స్వేచ్ఛాయుత వాతావరణంలో పిల్లలు చదువుకోవాలని వారి హక్కులను కాలరాస్తే సహించేది లేదని రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యులు కొనుగోటి అంజన్ రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీజి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలతో మాట్లాడారు. ఆపదలో ఉన్న చిన్నారులకు కాపాడేందుకు జిల్లా చైల్డ్‌లైవ్ పనిచేస్తుందని 1098కి ఫోన్ చేయడం ద్వారా సత్వర న్యాయం అందుతుందన్నారు. పిల్లల రక్షణ సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని పిల్లలు ఎలాంటి దుష్ప్రభావాలకు లోను కాకుండా చూడాలని అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ సభ్యులు డాక్టర్ సయ్యద్ మతిన్ అహ్మద్, నాంపల్లి మండల విద్యాధికారి గురువారావు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ ట్రస్మ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్లు సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపాల్ బంధనాదం సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)

ఎ, బి, రెండు కేంద్రాలు ఏర్పాటు చేయగా ‘ ఏ’ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కేంద్రానికి 200 మంది విద్యార్థులను కేటాయించగా సోమవారం నాటి పరీక్షకు 199 మంది హాజరయ్యారని ఒకరు మాత్రమే గైర్హాజరాయ్యరని సూపరింటెండెంట్ వివరించారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులకు తావివ్వవద్దని, అన్ని కేంద్రాలలో అవసరమైన త్రాగునీరు. ప్రథమ చికిత్స వంటివి ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జీరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని చెప్పారు. స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# వాహన తనీఖీల్లో పట్టుబడ్డ బంగారం విలువ 5 కోట్ల 73 లక్షలు

## జిల్లా ఎస్పీ చందనా దీప్తి

నల్గొండ జిల్లా బ్యూరోః పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఓటర్లను ప్రలోభ పెట్టే నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాకు చెక్ పెట్టడానికి జిల్లా పోలీసు యంత్రాగం గట్టి నిఘా పెడుతూ ముమ్మర తనిఖీలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో సోమవారం నాడు ఉదయం 11ః30 ని॥ల సమయంలో మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా వద్ద డిఎస్పీ మిర్యాలగూడ రాజశేఖర రాజు ఆధ్వర్యంలో, జి. సుధాకర్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, మిర్యాలగూడ 1 టౌన్, బి. శ్రీనివాస్, సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీసు, హెచ్‌సివి సైదులు, పిసిఎస్ జి. హుస్సేన్, పి. నాగరాజు మిర్యాలగూడ-1 టౌన్‌ల సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడ టౌన్ నుంచి కోదాడవైపు వెళ్తున్న టిఎస్ 09 యుఈ 2479 నెంబర్ కలిగిన బోలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా వాహనములో అందాజ అయిదు 5 కోట్ల 73 లక్షల రూపాయల విలువ గల బంగారం రవాణా చేస్తున్నట్లు గమనించి ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు ఇట్టి వాహనమును, ముగ్గురు వ్యక్తులను బంగారముతో సహా స్వాధీనంలోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

# జానకినగర్ తండా వాసుల నీటి కష్టాలు



చిలుకూర్ మేజర్ న్యూస్ః వేసవికి ముందే మండలంలోని గ్రామాలలో తాగునీటి సమస్య నెలకొంది. భూగర్భజలాలు రోజురోజుకు తగ్గుముఖం పట్టండం, నీటి వనరులు వట్టిపోతుండడంతో గ్రామాలు, తండాల్లో తాగునీటి కొరత ఏర్పడుతుంది. దీనికి తోడు గ్రామాల్లో చేతిపంపులు పనిచేయకపోవడం మరమ్మత్తులకు సైతం నోచుకోకపోవడంతో నీటి సమస్యలకు దారితీస్తుంది. చిలుకూరు మండలంలోని జానకి నగర్ తండాకు చాలా రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడం, తండాలోని బోర్లు పూర్తిగా ఎండిపోవడం వల్ల తండా గ్రామస్తులు త్రాగునీటి సమస్యను ఎదుర్కోంటున్నామని సోమవారం తెలిపారు. ట్యాంకర్ నీరు సరిపడక వ్యవసాయ బోరు బావులను అశ్రమిస్తున్నామన్నారు. ఈ విషయంపై కార్యదరిశని లక్ష్మీ ప్రవళిక వివరణ కోరగా ఈ రోజు కొత్త బోరును వేయించాము అందులో వాటర్ పడింది. దీనికి బోర్ మోటర్ మరమ్మత్తులు చేయించే లోపు ఊరికి దగ్గరలో వ్యవసాయ బోరు బావి నీరందిస్తామని తెలిపారు.

# ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు భరోసా కల్పిస్తూ పోలీసుల కవాతు



చిలూకూర్ మేజర్ న్యూస్ః పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు మేమున్నామని భరోసా ఇచ్చేందుకు పోలీసు కవాతు నిర్వహిస్తున్నారు. చిలుకూరు మండల కేంద్రంలోని సోమవారం కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించే వారికి తగిన చర్యలు తప్పవని సందేశం ఇచ్చేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు కోదాడ రూరల్ సిఐ రజిత రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎవరు కూడా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేఛ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు ఓటర్లందరికి రక్షణగా తామున్నాని ధైర్యం చెప్పేందుకే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలైన తమ దృష్టికి వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు ఎస్సై సురభి, రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా నియోజకవర్గ పాస్టర్స్ ఆత్మీయ సమ్మేళనం



చివ్వెంల, మేజర్‌న్యూస్ ః సోమవారం స్థానిక 5వ వార్డు సూర్యాపేట పట్టణం, శాంతినగర్ బేతెస్థ మినిస్ట్రీస్ క్యాంపస్ నందు సూర్యాపేట పట్టణ, నియోజకవర్గ పాస్టర్స ఫెలోషిప్, జిల్లా పాస్టర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య ప్రసంగికులు పాస్టర్ సి.హెచ్.డేవిడ్ బాపట్ల, యుసు క్రీస్తూ ప్రేమ, క్షమాపణ గూర్చి దైవ సేవకులను పురికొల్పినారు. దైవజనులు అందరు కలిసి జిల్లా అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ కరుణ శ్రీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవ డాక్టర్ జాన్ మార్క్, రెవ డాక్టర్ అజర్య, జే. డేవిడ్ నాయక్, పాస్టర్ ఇరుగు సంసోన్, డేవిడ్ బొందుగు హైదరాబాద్, డాక్టర్ జి శంతయ్య, బి. ప్రశాంత్, డి. లాకు నాయక్, నియోజకవర్గ అధ్యక్షులు జలగం జేమ్స్, జోయల్, చివ్వెంల అధ్యక్షులు గుగులోత్ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సాగుతున్న ప్రతిష్టా మహోత్సవాలు

కోదాడ టౌన్, మేజర్ న్యూస్ : కోదండ రామాలయం పునఃప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాగుబండి రామ్మూర్తి నగర్‌లో యాగశాల వద్ద 18 హోమగుండాలతో పూజలు చేశారు. హోమాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు నాగుబండి రంగా, నాగుబండి రంగనాథ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.







# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



హాలియా, మేజర్‌న్యూస్ : ఆదివారం అనుముల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వంగూరి కోటేష్ (22) సుమారు రాత్రి 9 గంటల సమయంలో నల్గొండలోని పెయింటింగ్ పని ముగించుకొని తిరిగి నల్గొండ కలెక్టరేట్ నుండి హాలియాకు బయలు దేరి వస్తున్న సమయంలో రోడ్డు రిపేరింగ్ జరుగుతున్న బిటిఎస్ కాలనీ దగ్గర నల్గొండలోని బైక్ క్రింద పడిపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించడం జరిగింది. మార్గం మధ్యలో మరణించడం జరిగింది.

# గాలికుంటు టీకాలు పశువులకు వేయించాలి



గుండాల మేజర్ న్యూస్ః మండలంలోని పాచిల్ల గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పశువైద్య శిభిరాన్ని వెటర్నరీ డాక్టర్ ప్రత్యూష ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ సీజన్లో వచ్చే గాలి కుంటు వ్యాధి నివారణ కోసం శక్తికాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని దీన్ని రైతులు అందుబాటులో ఉండి మీ పశువులకు ఈ టీకాలు వేయించి ఈ సీజన్లు వచ్చే వ్యాధులు నివారణ కోసం కృషి చేయాలని అన్నారు. సుమారుగా 180 పశువులకు టీకాలు ఇవ్వడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏ ప్రవీణ్ గోపాలమిత్రులు, గోవింద్, నరేష్, శేఖర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణి



తుర్కపల్లి మేజర్‌న్యూస్ఃమండల వ్యాప్తంగా ఉన్న 10వ తరగతి విద్యార్దులకు "గట్టు నిఖిల్ ఫౌండేషన్"ఆద్వర్యంలో పరీక్ష ప్యాడ్స్‌ను అందిస్తున్న సందర్బంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్న పాఠశాల విద్యార్దులకు కూడ పరీక్ష ప్యాడ్స్‌లను అందించారు. ఈ సందర్బంగా పలువురు మాటలాడుతు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను భాగా గుర్తుకు తెచ్చుకుని,పరీక్షలను భాగా రాయాలని కోరారు.

# ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు

చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభ మైనట్లు ఎంఈఓ. గురువారావు తెలిపారు. మొదటిరోజు మొత్తం 11 స్కూళ్లకు సంబంధించి 588 మంది విద్యార్థులు ఉండగా, నలుగురు పరీక్షలు రాయనట్టు ఎంఈఓ తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా హాల్ టికెట్ చూయించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా విద్యార్థులు రావాలని ఆయన కోరారు. 9 గంటలకు ముందే పరీక్ష హాలుకు హాజరు కావాలని సూచించారు.

# తొలిరోజు ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



తుంగతుర్తి, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఒక్క నిమిషం నిబంధన ఉండడంతో విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్ష సెంటర్లకు చేరుకొని నోటీస్ బోర్డుల పై తమ హాల్ టికెట్ నెంబర్ చూసుకొని తమకు కేటాయించిన గదులలోకి వెళ్లారు. ఈ మేరకు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అధికారులు సెట్టింగ్ కార్డులను ఏర్పాటు చేసి ప్రశాంతంగా నిర్వహించారు.

***గుండాల :*** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం



ప్రశాంతంగా నిర్వహించారు. గుండాల మండల ంలోని కస్తుర్భా మోడల్‌స్కూల్‌తో పాటు పెద్ద పడిశాల, వస్తా కొండూర్, సుద్దాల వెల్మజాల, అనంతారం, గుండాల గ్రామాలకు సంబంధించిన పదో తరగతి విద్యార్థులు మొత్తం అన్ని ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని పరీక్ష నిర్వహణ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.పోలీస్ పర్యవేక్షణలో 144 సెక్షన్ విధించి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఎస్సై యాకన్న, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

***మోత్కూర్ :*** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్, సెక్రెడ్ హార్ట్ హైస్కూల్,







మండలంలోని దాచారం గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ కేంద్రాలలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 193 మంది విద్యార్థులకు 193 మంది విద్యార్థులు హాజరు కాగా,సెక్రెడ్ హార్ట్ హైస్కూల్లో 260 మంది విద్యార్థులకు 259 మంది విద్యార్థులు హాజరు కాగా, దాచారం జెడ్పీహెచ్‌ఎస్‌లో 53 మంది విద్యార్థులకు 53 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు.

# కన్నుల పండుగగా నారసింహుని కల్యాణం

యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్టలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. కొండపైన ప్రధానాలయ పునర్నిర్మాణం అనంతరం రెండోసారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి ఆలయ మాడ వీధిలోని ప్రత్యేక కళ్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల తిరు కల్యాణ మహోత్సవం కన్నులపండుగగా జరిగింది.రాత్రి 8.45. గంటలకు ప్రారంభమైన కల్యాణ మహోత్సవం దాదాపు రెండు గంటల పాటు అంగ రంగ వైభవంగా జరిగింది.స్వామివారికి ప్రభుత్వం తరఫున తిరు కల్యాణానికి పట్టువస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కళ్యాణముకు భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది.కల్యాణ మండపంలో స్వామిఅమ్మవార్లను అధిష్టింపజేసి కల్యాణ ఘట్టాన్ని ఆరంభించారు అర్చకులు. వేదపండితుల మంత్రోచ్చారణలు, వేదపారాయణాలు, మంగళవాయిద్యాల కరతాళ ధ్వనుల మధ్య ముల్లోకాది దేవతలు చూస్తుండగా నరసింహస్వామివారు లక్ష్మీఅమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేశారు. ఆ సమయంలో ఆలయ ప్రాంగణం "నమో నారసింహ, జై నారసింహ, గోవిందా" నామస్మరణతో మార్మోగింది.స్థానిక ప్రజాప్రతిని ధులు, పలువురు వీఐపీలు స్వామివారి వైభవ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామిఅమ్మవార్ల కల్యాణ ఘట్టాన్ని తిలకించిన భక్తులు తమ జన్మ ధన్యమైందని భావిస్తూ ఆనందపరవశులైనారు. సమస్త దేవతలు, మహర్షులు, ప్రకృతిలోని ప్రాణకోటి మొత్తం ఈ కల్యాణ వేడుకను తనివితీరా వీక్షించి పరవశించారని వేదపండితులు భక్తులకు ప్రవచించారు. లోక కల్యాణం, జగత్ రక్షణ కోసం స్వామివారు లక్ష్మీదేవి మెడలో మంగళసూత్రధారణ గావించారని, స్వామివారి కరుణాకటాక్షములు అమ్మవారితో పాటు సమస్త లోకాలు సంతరిస్తాయని అర్చకులు వివరించారు. ఈ వేడుకలో అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఆలయ ఈవో ఎం.భాస్కరరావు, ఉప కార్యనిర్వాహణాధికారులు పర్యవేక్షకులు ఆలయ సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుపై తూటా

చందంపేట, మేజర్‌న్యూస్ ః రైతాంగ ఆత్మహత్యలు నివారిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీలిచ్చి కేంద్రంలోను, మధ్యప్రదేశ్‌లోను అందలమెక్కిన బీజేపీ ప్రభుత్వాలు అన్నదాతలపైనే తుపాకీ ఎక్కుపెట్టడం హేయమైన చర్య. ఒకవైపు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మరో వైపు రైతులను పిట్టలను కాల్చినట్టు కాల్చిపడేసిన పాలకుల కిరాతకాన్ని ఎంత ఖండించినా తక్కువే. మధ్యప్రదేశ్‌లో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని అడిగారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాత్రమే వారు కోరారు. రైతులపైకి పోలీసులను ఉసిగొల్పి ఆరుగురిని పొట్టనబెట్టుకోవడం దుర్మార్గం. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వమైనా నిర్వర్తించాల్సిన కనీస బాధ్యత. దీనిని విస్మరించి నిరంకుశంగా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికం. మధ్యప్రదేశ్‌లో మొదట ఒక జిల్లాలో ప్రారంభమైన రైతుల ఆందోళన క్రమంగా రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలకు విస్తరించింది. మందసోర్, పిప్లియామండీ ప్రాంతాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి రైతుల పోరాటాన్ని అణచివేయాలని చూసింది. ఈ పాపంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికీ వాటా వుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచినా రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. నయా ఉదారవాద విధానాలతో ఇప్పటికే సంక్షుభితంగా మారిన వ్యవసాయరంగం మోడీ ప్రభుత్వ నిర్వాకం వల్ల మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. మధ్యప్రదేశ్‌లో కాల్పులు దీనికి పరాకాష్ట. కేవలం ఒక్క మధ్యప్రదేశ్‌లోనే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోను, దాని మిత్రపక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాల్లోను రైతు వ్యతిరేక విధానాలు ఉధృాఎతంగా అమలవుతున్నాయి. మొత్తం రైతు ఆత్మహత్యల్లో 60శాతం దాకా ఈ రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మొదట గుజరాత్ రైతాంగం వీధుల్లోకి వచ్చింది. నేడు మహారాష్ట్రలో రైతాంగ పోరాటాలు ఉధృాఎతంగా సాగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈనాడు బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఈ దేశ రైతాంగం తిరుగుబాటు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లో రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో రైతులు వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మె, రాష్ట్ర బంద్ అసాధారణమైనది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అనే కాదు, మిగతా రాష్ట్రాల్లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రైతాంగంలో ఆగ్రహం రగుల్కొంటోంది. చత్తీస్‌ఘడ్, హర్యానా, జార్ఖండ్‌ల్లో రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. రైతుల పోరాటానికి బాసటగా నిలవాలని సామాజిక కార్యకర్త అన్నా హజారేను రైతు సంఘాలు కోరగా ఆయన అందుకు నిరాకరించారు. ఇది ఆయన సంకుచిత ధోరణికి నిదర్శనం. ఎఐకెఎస్, ఇతర రైతు సంఘాల ఆధ్వర్యాన మహారాష్ట్ర రైతులు పట్టుదలతో పోరాడుతున్నారు. రైతులు తమ నిరసనలో భాగంగా వ్యవసాయోత్పత్తులను పట్టణాలకు సరఫరా చేయడానికి నిరాకరిస్తున్నారు. వాటిని రోడ్లపై పారబోస్తున్నారు. మహారాష్ట్రలోని ఫడ్నవీస్ ప్రభుత్వం రైతులతో చర్చించి సామరస్యంగా దీనిని పరిష్కరించుకోవడానికి బదులు ఈ ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం అవివేకం. తమిళనాడులో 140ఏండ్లలోనే అతి పెద్దకరువు గత సంవత్సరం చోటు చేసుకుంది. ఈ కరువు బారిన పడి ఇప్పటివరకు 400మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

సూర్య



# ఘనంగా లక్ష పుష్పార్చన







భూదాన్ పోచంపల్లి, మేజర్‌న్యూస్ : భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని కనుముక్కుల గ్రామంలో శ్రీశ్రీశ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారము ఆలయ నిర్మాణ కర్త, చైర్మన్, జడ్పీటిసి కోట మల్లారెడ్డి పుష్పలత ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గట్టు పాండు రంగారెడ్డి, అధ్యక్షుడు పాక నరసింహ యాదవ్, ఉపాధ్యక్షుడు రంగ మధు, సభ్యులు కోట భూపాల్ రెడ్డి, కోట రంగారెడ్డి, కోట అజిత్ రెడ్డి, కట్కూరి వెంకటేష్, నూకల శేఖర్ యాదవ్, మట్టిపల్లి లింగస్వామి యాదవ్, ఐలయ్య యాదవ్, ముటుకులోజూ వేణుగోపాల చారి, నెలికంటి లింగస్వామి యాదవ్, ముదిగొండ రాములు, చుక్క యాదయ్య, మంచాల నవీన్, దేవరకొండ బాలా చారి, బోయపల్లి పాపిరెడ్డి, చుక్క జంగయ్య, ఒంటెద్దు ప్రసాద్, కోట సత్తిరెడ్డి, కూసుకుంట్ల రమేష్ రెడ్డి, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరుకల నాంచారమ్మ రాష్ట్ర ఉత్సవ కమీటి చైర్మన్‌గా కుతాడి సురేష్

భువనగిరి, మేజర్‌న్యూస్ ః మే నెల 21,22,23 తేదిలలో యాదాద్రిభువనగిరి జిల్లాలోని పోచంపల్లి మండల పరిదిలోని పిలాయిపల్లి గ్రామములో కొలువై ఉన్న ఎరుకల నాంచారం జాతరను జరుపుకుటకు గాను రాష్ట్ర మరియు జిల్లా కమీటి పిలాయిపల్లి గ్రామములో సమావేశం ఏర్పాటు జరిగినది.ఈ సందర్భంగా జాతర గురించి పలు అంశాలు చర్చించి,నిర్ణయాలను తీసుకున్నారు.అనంతరం నూతన కమీటిని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కమీటి కాలపరిమితి 2 సంవత్సరాలు ఉంటుందని తెల్పారు.ఈ సందర్బంగా రాష్ట్ర అద్యక్షులు,గుడి నిర్మాణ దాత,కమీటి శాశ్వత చైర్మన్ కుతాడి రాములు ఆదేశాల మేరకు ఈ ఉత్సవ కమీటి ని నిర్ణయించడం జరిగినది.నూతన కమీటి వివరాలుఃఉత్సవ కమీటి చైర్మన్ కుతాడి సురేష్,ప్రదాన కార్యదర్శిగా కుతాటి మహేష్,ఉత్సవ కమీటి వైస్ చైర్మన్‌గా కోనేటి నరసింహ,మధలపురం గోపాల్,దేవరాయ కుమార్,కుతాడి యాదగిరి,కుతాడి భాస్కర్, రుద్రాక్ష నరసింహ,రాయపురం వెంకటేశ్వర్లు,బిక్షపతి,అంగడి లక్ష్మీనారాయణ, అంగడి నారాయణ,వీరన్న,కోశాధికారి కుతాడి యాదగిరి, కార్యదర్శులుగా కుతాడి నందం,కుతాడి బాలరాజు ,కుతాడి అంజన్ కుమార్, దేవరాయ సుధాకర్, మానుపాటి సంపత్,డైరెక్టర్లుగా కుతాడి అంజయ్య,కుతాడి ముత్యాలు, కేంసారం నాగరాజు,పుడుత సాలయ్య,బిజిలి సంపత్, అంగడి దినేష్‌ని ఎన్నుకున్నారు.



# అనుముల ప్రాజెక్టులో పోషణ పఖ్వాడా





హాలియా, మేజర్‌న్యూస్ : అనుముల మండల పరిధిలోని చింతగూడెం ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో జరిగిన పోషణ పఖ్వాడ కార్యక్రమం జరిగినది. అనుముల ఐసిడియస్ ప్రాజెక్ట్ అనుముల ఎ.సి.డి.పి.ఓ సువర్ణ మాట్లాడుతూ కిషోర బాలికలకు చిరు ధాన్యాల గురించి వివరించారు. ప్రతి పోషక ఆహారం తీసుకోవాలని సూచించారు. రోజు వారి ఆహారంలో భాగంగా మిల్లెట్స్‌ని చేర్చాలని తెలియజేసారు. నేటి బాలలే రేపటి పౌరులుగా అభివర్ణించారు. రక్త హీనత రాకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియపరిచారు. నిత్యం వ్యక్తిగత శుభ్రత పాటించాలని చెప్పారు. సూపర్ వైజర్ సరిత మాట్లాడుతూ మిల్లెట్స్‌లో వుండే విటమిన్స్, ఐరన్, ప్రోటీన్స్ గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఎ.సి.డి.పి.ఓ సువర్ణ, సూపర్ వైజర్ సరిత, అంగన్వాడీ టీచర్స్ యమున, శిరీష, రేణుక, సునిత, సలోమి ఇందిరా, అరుణ, జయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని - విద్యార్థుల, గర్భిణీ-బాలింతలు, తల్లులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో తప్పులేకుండా చూసుకోవాలి

## చండూరు ఆర్డిఓ డి.సుబ్రమణ్యం

### నూతనంగా మంజూరు అయిన పోలింగ్ కేంద్రాలను పరిశీలన



మునుగోడు, మేజర్‌న్యూస్ : ఓటరు జాబితాలో తప్పులేకుండా చూసుకోవాలి అనీ చండూరు ఆర్డిఓ డి.సుబ్రమణ్యం అన్నారు. సోమవారం మండలంలోని పులిపలుపుల పరిధిలోని బీరెల్లిగూడెం, కల్వలపల్లి పరిధిలోని కాశవారిగూడెం మరియు రామకృష్ణాపురం గ్రామాలలో కొత్తగా ఏర్పాటు చేయబోయే పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషనులో కనీస సౌకర్యాల ఏర్పాటు గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌లు దూరంగా ఉన్నాయని రాజకీయ పార్టీల నాయకులు గతంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దానిపై క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించిన అనంతరం ప్రజలకు అందు బాటులో ఉండే విధంగా నూతన పోలింగ్‌స్టేషన్ లను ఏర్పాటు చేశమన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ముందస్తుగా బీఎల్‌వోలకు సూచనలు ఇచ్చామన్నారు. ఆర్డీవో వెంట తహసిల్దార్ ఏం.నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ నేలపట్ల నరేష్, ఆర్ఐ నాగరాజు, ఘట్టుప్పల్ ఆర్ఐ హుస్సేన్‌లు ఉన్నారు.

# మోసపూరిత కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## - ఎస్ఐ పి.రవీందర్




పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : అనుమానిత వ్యక్తుల నుంచి వచ్చే మోసపూరిత కాల్స్, మెసేజ్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.రవీందర్ అన్నారు. మండల పరిధిలోని దుపహాడ్ గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్థులకు ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గడిచిన కొంతకాలం నుంచి సైబర్ నేరాలు పెరిగాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాలు, మత్తుమందు అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలు వేసవికాలంలో విలువైన వస్తువులను ఇండ్లలో ఉంచ వద్దని వేసవిలో దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది కనుక తగు జాగ్రత్తతో ఉండాలని ఆయన సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాలలో తిరుగుతుంటే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గోపగాని సాయిలు, జడ వీరయ్య, యరకల రామయ్య, రామనర్సయ్య, సక్రు, గుంజ వేణు, సందీప్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండా ముద్దుబిడ్డ ఒగ్గు ఎంకన్న

## - సిపిఐ(ఎం) మండల కార్యదర్శి రణపంగ కృష్ణ



పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : నిత్యం ఎర్రజెండా కొరకు పరితపించే వ్యక్తి, ఎర్రజెండా ముద్దుబిడ్డ ఒగ్గు ఎంకన్న ముద్దుబిడ్డ వెంకన్న అని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి రణపంగ కృష్ణ అన్నారు. మండల కేంద్రానికి చెందిన శాఖ కార్యదర్శి, మండల కమిటీ సభ్యుడైన వెంకన్న సోమవారం అనారోగ్యంతో మరణించగా ఆయన మృతదేహం పై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మండల కేంద్రంలో పార్టీ ఎదుగుదలకు వెంకన్న ఎంతో కష్టపడి పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో పాల్గొని, పార్టీకి ఎంతో సేవ చేశారని అన్నారు. కేంద్రంలో పార్టీ శాఖ కార్యదర్శిగా ఎన్నికై అనునిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నికరంగా నిలబడి పోరాటాలు నడిపిన వ్యక్తి ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చినపంగి నరసయ్య, వీరబోయిన రవి, గ్రామ నాయకులు సైదులు, శంకర్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శాలిగౌరారం ఎస్సైగా వి.ప్రవీణ్ కుమార్

శాలిగౌరారం మేజర్ న్యూస్ః శాలిగౌరారం నూతన్ ఎస్సైగా వి. ప్రవీణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సిసిఎస్ నల్గొండలో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఎస్సైగా పనిచేస్తున్న ఎం. ఐలయ్య సిసిఎస్ నల్గొండకు బదీలిపై వెళ్లారు. కేవలం కొద్ది రోజులు మాత్రమే పనిచేసి తక్కువ కాలంలో బదిలీపై వెళ్లడం మండలంలో చర్యనీయాంశంగా మారింది.



# ఎండుతున్న పంటలకు సాగు నీరిచ్చి రైతన్నలను కాపాడాలి

## తాటికొండ సీతయ్య



తుంగతుర్తి, మేజర్‌న్యూస్ : గత ప్రభుత్వంలో పచ్చని పైరులతో అలరారిన పంటలు నేడు సాగునీరు లేక బోర్లలో నీరు అడగంటి పోయి వరి పొలాలు ఎండుతున్న పరిస్థితిని చూసి రైతన్న అప్పుల పాలవుతున్నాదని రాష్ట్ర ప్రభత్వం సాగు నీరు అందించడంలో విఫలమయిందని అన్నారు. ఏప్రిల్ 10వరకు సాగు నీరు ఇచ్చి ఎండుతున్న పంటలను కాపాడాలని ఎండిన పంటలకు ఎకరాకు 25వేల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీలు మారుతున్న నాయకులను చేర్చుకునే దాని మీద ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమం లేదని అన్నారు. ఈ సమావేశం లో జిల్లా నాయకులు గుండాగాని రాములు గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీశైలం, మండల యూత్ అధ్యక్షులు పోగుల శ్రీకాంత్ రెడ్డి, గ్రంధాలయ మాజీ చైర్మన్ గోపగాని రమేష్, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్ధులకు మజ్జిగ పంపిణీ




శాలిగౌరారం మేజర్ న్యూస్ః ఎండలలో పరీక్షలు రాసే పదవ తరగతి విద్యార్ధులకు ఉపశమనం కలగడానికి చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను శాలిగౌరారం డిప్యూటీ తహసిల్దార్ మహ్మద్ అబ్దుల్ సత్తార్, ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్‌లు పంపిణీ చేశారు. 350 మంది పదవ తరగతి విద్యార్ధులకు మజ్జిగ ప్యాకెట్లను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి బుడిగె శ్రీనివాసులు, బండపల్లి కొమరయ్య గౌడ్, చింత ధనుంజయ్, మాదారం ఎంపిటిసి నోముల జనార్ధర్, యంగలి రాంబాబు, బొల్లికొండ గణేష్, జోలం రమేష్, చిల్లెంశెట్టి సాయి గణేష్, చీమల శ్రవణ్, తహసిల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వంటెపాక రాంబాబు, రికార్ట్ అసిస్టెంట్ అల్లుబెల్లి రాంరెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

# కులాంతర వివాహాలు చేసుకున్నవారి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## వ్యవస్థాపక అధ్యక్షుడు యేలేటి ఆంజనేయులు

కోదాడ (మేళ్ళచెర్వు), మేజర్ న్యూస్ : కులాంతర వివాహాలు చేసుకున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని



కులాంతర వివాహాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యేలేటి ఆంజనేయులు కోరారు. మేళ్లచెర్వు మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో బడ్జెట్ విడుదల చేయకపోవడం వలన కులాంతర వివాహాలు చేసుకున్నవారికి ఎలాంటి ప్రోత్సాహకాలు అందడం లేదని వాపోయారు. సంఘం నాయకులు రేపాక శ్రీశైలం, గుంజలూరి సురేందర్ పాల్గొన్నారు.

# తెలంగాణ జర్నలిస్టు యూనియన్ 2024 డైరీని ఆవిష్కరించిన మంత్రి





భువనగిరి మేజర్‌న్యూస్ః తెలంగాణ జర్నలిస్టు యూనియన్-2024 సంవత్సరంనకు సంబందించిన డైరీని తెలంగాణ రాష్ట్ర కాంగ్రేస్ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరియు మంత్రి పోన్నం ప్రభాకర్ చేతుల మీదగా ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా మంత్రులు మాటలాడుతు కాంగ్రేస్ ప్రభుత్వ హయంలోనే జర్నలిస్టులకు పెద్ద పీట వేస్తుందని తెల్పారు. అందుకు ప్రతి జర్నలిస్టుకు న్యాయం రిగేల,రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను సిద్దం చేస్తుందని తెల్పారు. ఆనంతరం కప్పర ప్రసాద్ మాటలాడుతు ఈ సంఘం 2012లో ఏర్పాటు చేయడం జరిగినదని,ఆనాటి నుండి నేటి వరకు జర్నలిస్టు సమస్యలపై అనేక పోరాటాలను నిర్వహించి,సాధించిన సంఘం అని తెల్పారు. ఈ కార్యక్రమములో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఆద్యక్షులు కప్పర ప్రసాదరావు,ఐఎఫ్‌డబ్ల్యూజె పెద్దాపురం నరసింహ,రాష్ట్ర ప్రదాన కార్యదర్శి బింగి స్వామి,రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్,దాసన్న,రాష్ట్ర కార్యదర్శి బర్ల శ్రీనివాస్,దశరధ,రాష్ట్ర సహాయ కార్యదర్శి బీపూరావు,ఎబి న్యూస్ చైర్మన్ బ్రహ్మ,యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా,జిల్లా ఉపాధ్యక్షులు చింతకింద వెంకటేశ్వర్లు,గుండాల అద్యక్షులు సురారపు నరేష్,జర్నలిస్టు నాగరాజు మరియు వివిధ జిల్లాలకు సంబందించిన ఆధ్యక్షులు పాల్గోన్నారు.

# చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



నేరుడుచర్ల మేజర్ న్యూస్ః చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్వాడీ టీచర్ ఎస్. విజయ అన్నారు. పోషణ పక్షంలో భాగంగా నేరేడుచర్ల మండలం, నరసయ్య గూడెం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి ఆమె అవగాహన కలిగించారు. ఈ నెల 09 నుంచి 23 వరకు పోషణపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని, ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాలు, పప్పులు, పండ్లు కూరగాయలు, వేరు వేరుగా తీసుకోవాలని కోరారు. ప్రతి ఇంటిలో ఆకు కూరలు, పండ్ల మొక్కలు పెంచుకోవాలన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా ఈ సమాధానం, ఆశావర్కర్ యు. రమణ, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి కౌన్సిలర్ సభ్యత్వానికి రాజీనామా

## స్థానిక ఎమ్మెల్యే ఒత్తిళ్లకు తలొగ్గలేక పదవి బాధ్యతల నుండి తప్పుకుంటున్నా...

## పోతరాజు రజినీ రాజశేఖర్






తిరుమలగిరి మున్సిపాలిటీ మేజర్ న్యూస్ః తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవికి 5వ వార్డు కౌన్సిలర్, పదవికి రాజీనామా చేస్తున్నట్లు చైర్‌పర్సన్ పోతరాజు రజినీ రాజశేఖర్ సోమవారం నాడు ఒక బహిరంగలేఖ విడుదల చేశారు. ఆ లేఖలో క్రింది విధంగా తెలిపింది. మొట్టమొదటి సారిగా ఏర్పడిన మున్సిపాలిటీ మొట్టమొదటి సారిగా దళిత ఆడబిడ్డను స్పష్టమైన మెజార్టీతో గెలిచి ప్రజాస్వామ్యంగా ఎన్నుకోబడిన చైర్ పర్సన్ నేను కానీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే మున్సిపాలిటీలో ఎలాంటి కార్యక్రమాలు జరగకుండా అడ్డుపడుతున్నారని చైర్‌పర్సన్ మార్చాలని అందకు సహకరించాలని మా పార్టీ ప్యానెల్ కౌన్సిలర్లకు హుకుం జారీ చేసినాడు. అందుకు సహకరించని మా సభ్యులను అధికార దర్పంతో బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి, ప్రలోభ పెట్టి క్యాంప్ రాజకీయాలకు తెరలేపాడు. ఒక పార్టీలో గెలిచి బీఆర్ఎస్ ప్యానల్‌లో చైర్‌పర్సన్‌గా ఎన్నికై అధికార పార్టీకి పోలేకా, ఎమ్మెల్యే అధికారం ముందు తలొగ్గలేక వ్యక్తిత్వం వదులుకోలేక నానే నేనుగా స్వచ్ఛందంగా పదవి బాధ్యతల నుండి తప్పుకుంటున్న కులం పేరు చెప్పుకొని 50 వేల మెజార్టీతో గెలిచి అదే సామాజికవర్గానికి చెందిన నాపై కక్ష సాధింపు చర్యలకు దిగడం అత్యంత బాధకరం అన్నారు.

# బ్యాంకర్లు అనుమానస్పద లావాదేవీల పై గ్రీవెన్స్ కమిటీకి సమాచారం అందించాలి

## జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన

నల్గొండ జిల్లా బ్యూరోః సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ సమావేశంలో ఆమె బ్యాంకర్లతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నగదుతోపాటు, ఆభరణాలు, వస్తువులను పంపిణీ చేసేందుకు అవకాశం ఉందని, వీటన్నింటిపై గట్టి నిఘా ఉంటుందని తెలిపారు. ప్రత్యేకించి బ్యాంకుల ద్వారా నిర్వహించే అనుమానాస్పద లావాదేవీలపై దృష్టి సారించి వివరాలను తక్షణమే పోలీస్ లేదా జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్, ఇన్కమ్ టాక్స్, జిఎస్టీ శాఖలు వారి వారి శాఖల ద్వారా నిర్వహించే విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ బ్యాంకర్లు అనుమానస్పద లావాదేవీలతో పాటు గూగల్‌పే, ఫోన్‌పే నుండి ఎక్కువ మందికి మొత్తాన్ని పంపిచినప్పుడు, అదేవిధంగా ఏదైనా షాపులకు ఎక్కువ మొత్తంలో కూపన్ల వంటివి ఇవ్వడం చూసినపుడు వాటిపై కూడా దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు జెడ్పీ సీఈవో, జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ నోడల్ అధికారి ప్రేమ్ కరణ్ రెడ్డి జిల్లా స్థాయిలో నగదు, ఆభరణాలు సీజ్ చేయడం, విడుదల చేసే అంశాలపై వివరించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచందర్, అదనపు ఎస్పీ రాములు నాయక్, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



# ఎన్నికల ప్రచార సభలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి

## రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల అధికారి, సీపీ సూచన



హైదరాబాద్, మేజర్ న్యూస్ ( సిటీ ప్రతినిధి)ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాల్సి ఉంటుందని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం కమిషనర్, సీపీ లు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగే లా రాజకీయ పార్టీ ల తరవున కృషి చేయాలనీ అదే విధంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని అన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు, అభ్యర్థులకు ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తామని, అయితే కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, మాన్యువల్ గా అనుమతులు ఇవ్వమని అన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలు లేదని అన్నారు. మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ విద్వేషాలు చెలరేగేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘున పై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎం.సి.సి, సర్వేలెన్స్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్స్ బృందాలను, ఎం.సీ.ఎం.సి కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పై ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సి-విజిల్ యాప్ ద్వారా చేయవచ్చుని టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-2999 కు సూచించారు. 24 గంటలపాటు పని చేస్తాయని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు అన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, అదేవిధంగా పబ్లిషర్ పేరు ఎన్ని ప్రతులు ప్రింట్ చేశారో అట్టి కరపత్రంలో ముద్రించాలని లేని పక్షంలో ప్రింటింగ్ ప్రెస్ పై చర్యలు తీసుకుంటామని ఈ అంశాన్ని అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎన్నికల ప్రచార ప్రకటనలు, కరపత్రాలు ముద్రించే అంశాలు, ఇతర ప్రచార అంశాలకు సంబంధించి తప్పనిసరిగా ఎం.సీ.ఎం.సీ ద్వారా ముందస్తుగానే అనుమతి తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ని ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, దీనిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన రేట్ చార్ట్ ప్రకారం ఎన్నికల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుందన్నారు. సువిధ ద్వారా అనుమతులు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా అనుమతులు ఇస్తారని సూచించారు. ఫారం 7, 8 క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ మార్చి 23 వరకు తీసుకుంటామని ఫారం 6 మాత్రం చివరి నామినేషన్ 10 రోజుల ముందు వరకు తీసుకుంటామని అన్నారు.పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... కుల, మతాల ప్రాతిపదికన ఓట్లు అడగరాదన్నారు. రెచ్చగొట్టే విధంగా మాట్లాడ రాదని,వ్యక్తిగత దూషణలు,అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఓటర్లను తప్పు దోవ పట్టించే విధంగా సమాచారం ఇవ్వడం/ వ్యవహరించడం,మహిళల గౌరవానికి భంగం కలిగించే విధంగా మాట్లాడటం, గురుద్వారా, మసీదులు, చర్చిలు, దేవాలయాలు ఎన్నికల ప్రచారానికి వినియోగించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, తదితరాలు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘున గా పరిగణించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ప్రభుత్వ వాహనాలు వాడ రాదని, ఓటర్లను తరలిం చరాదని తెలిపారు.పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపు పొలిటికల్ పార్టీల బూత్ లు ఉండరాదని తెలిపారు. లైసెన్స్ వెపన్స్ ఉంటే డిపాజిట్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, అడిషనల్ సి పి విక్రమ్ సింగ్ మాన్, ఈ వి డి ఎం ప్రకాష్ రెడ్డి, ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్ అలివేలు మంగ తయారు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎం.ఎం.ఐ నుండి కార్వాన్ శాసన సభ్యులుకౌసర్ మోయినుద్దీన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు జి.నిరంజన్, పి.రాజేష్ కుమార్, వాజిద్ హుస్సేన్, బిజెపి పార్టీ ప్రతినిధులు కొల్లూరి పవన్ కుమార్, వి.ఎస్.భరద్వాజ్, సి.పి.ఎం పార్టీ ప్రతినిధి శ్రీనివాస్రావు, టి.ఆర్.ఎస్ పార్టీ ప్రతినిదులు కె.కృష్ణదాస్, ఎన్.విజయ్ కుమార్, బి.ఎస్.పి పార్టీ ప్రతినిధి కె.నందీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద చిన్నారుల జీవితాలలో మార్పే లక్ష్యంగా యశోద ఫౌండేషన్ మస్తీ' ఆవిష్కరణ

హైదరాబాద్, మార్చి 2024: నిరుపేద చిన్నారుల్ జీవితాలలో మార్పే లక్ష్యంగా యశోద ఫౌండేషన్ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మస్తీ'ని బంజారాహిల్స్ లో రాష్ట్ర పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో పోలీస్ కమిషనర్ కే శ్రీనివాస్ రెడ్డి, ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్, ఐటీ కమ్యూనికేషన్స్ డిపార్ట్మెంట్ తెలంగాణా స్టార్ట్ అప్ తెలంగాణా ఓఎస్డీ ఎల్ రమాదేవి శనివారం లాంచనంగా ప్రారంభించారు. ఎం ఏ ఎస్ టీ ఐ అనగా మ్యూజిక్, ఆర్ట్స, సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్(సంగీతం, కళలు, సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్) అని అర్థం. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎఫ్టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్, ఫిక్కీ ఎఫ్ఎల్వో చైర్పర్సన్ రీతు షా, ఆడియో ఇంజనీర్ సాజిదా ఖాన్, సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సోమదత్తా కారక్, బచ్పన్ బచావో ఆందోళన్కు లీగల్ కన్సల్టెంట్ శ్రీహర్షిత చడా, ఫుడ్4థాట్ సహ వ్యవస్థాపకుడు షెఫాలీ రావుహాజరయ్యారు.



# హైదరాబాద్‌లో ఈనెల 30, 31 తేదీలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై కాన్ఫరెన్స్



హైదరాబాద్, మార్చి 2024: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ పై భారతదేశంలో అతిపెద్ద కాన్ఫరెన్స్ ఏఐ డేస్ 2024 హైదరాబాద్లో ఈనెల 30, 31వ తేదీలలో నిర్వహించనున్నట్లు స్వేఛ్చా వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర తెలిపారు. గచ్చిబౌలిలోని స్వేఛ్చా తెలంగాణ, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు జేఎన్టీయూ హైదరాబాద్ వేదిక కానుందన్నారు. ఈ సదస్సులో రెండు వేల మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గల 70 కి పైగా స్పీకర్లు పాల్గొంటారన్నారు. ఈ సదస్సుతో హైదరాబాద్ ఏఐ రాజధానిగా మారేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. 'ఏఐ4సొసైటీ'నినాదంగా స్వేఛ్చా భాగస్వాములతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఏఐ డేస్ వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకచోటకు చేరుస్తుందన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, అగ్రిటెక్, ఫిన్‌టెక్, సెమీ కండక్టర్స్, ఎడ్యుటెక్, వివిధ స్టార్టప్‌లు - సమాజ శ్రేయస్సు కోసం ఏఐని నిర్మించడంలో ముందుకు సాగే మార్గం కోసం గూగుల్,ఫేస్‌బుక్ (మెటా) మైక్రోసాఫ్ట్, క్వాల్కామ్, మైక్రాన్, ఓజోనెటెల్, టెక్ వేదిక, డిజీక్వాన్టా,ఆర్కా మీడియా వర్క్స వంటి ఇతర సంస్థల స్పీకర్‌లు ఈ చర్చల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐ పాలన, విధానపరమైన అంశాలపై చర్చలు జరుగుతాయని చెప్పారు.

# ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలి.

## మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టు సబార్డినేటర్ పోస్టుల బాధితుల సంఘం

హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ : జిల్లా కోర్టులో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు అన్ని పరీక్షలు నిర్వహించి నాన్ లోకల్ పేరిట తమకు అపాయింట్మెంట్ ఆర్డర్ ఇవ్వకుండా వేధిస్తున్న నిర్వాహక కమిటీపై చర్యలు తీసుకోవాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్ట్ ఆఫీస్ సబార్డినేటర్ పోస్టుల బాధితుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు కత్తి రమేష్, అనురాధ ,వనజ, బాబురావు ,కవిత లు మాట్లాడారు. 92 పోస్టులకు గాను 81 మందిని సెలక్షన్ లిస్ట్ లో ప్రకటించి , 63 మందికి మాత్రమే జనవరి 12న అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. తమను నాన్ లోకల్ పేరిట 18 మందికి చివరి క్షణంలో అపాయింట్మెంట్ ఆర్డర్లు ఆపేశారని ఆవేదన చెందారు. గత 16 నెలలుగా తాము ఈ పోస్టులకు సంబంధించిన అన్ని పరీక్షలను ఎదుర్కొన్న తర్వాత ప్రస్తుతం తమను నాన్ లోకల్ అని ఉద్యోగాలు ఇవ్వకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని వాపోయారు. దీనిపై నిర్వాహ కమిటీని ప్రశ్నిస్తే హైకోర్టుకి వెళ్ళమంటూ, హైకోర్టు వారిని కలిస్తే జిల్లా కోర్టుకు వెళ్ళండి అని గత కొంతకాలంగా వేధిస్తున్నారని అన్నారు. పోస్ట్ కు 1:3 నిష్పత్తిలో పిలవాల్సింది పోయి, తమ ఇష్టానుసారము పిలిచి ప్రస్తుతం నాన్ లోకల్ అంటూ తమకు మొండి చేయి చూపడం అవమానకరంగా భావిస్తున్నామని అన్నారు. 2019 నోటిఫికేషన్ లో కూడా కరీంనగర్ జిల్లాలో ఇలానే గందరగోళానికి గురిచేసి నిరుద్యోగులను మోసం చేశారని గుర్తు చేశారు. కావున ఈ నియామకాలపై ఉన్నత స్థాయి కమిటీని వేసి నిజనిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయకుంటే రానున్న రోజుల్లో ఇందిరాపార్క్ వద్ద నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు.

# ఈ సాహిత్యంలో మేమెక్కడ ?

## కవయిత్రి , రచయిత్రి జూపాక సుభద్ర ప్రశ్న



హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ : ఆర్థికంగా, సామాజికంగా అట్టడుగున కునారిల్లుతున్న జీవితాన్ని ముఖ్యంగా స్త్రీల జీవితాన్ని గురించి నేను చదివిన పుస్తకాల్లో ఎక్కడా లేకపోవడమే నన్ను తర్వాతి కాలంలో కవయిత్రిగా, రచయితగ్రా చేసిందని ప్రముఖ కవయిత్రి,రచయిత్రి జూపాక సుభద్ర అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న 'నేను నా రచనలు'కార్యక్రమంలో సోమవారం డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో జూపాక సుభద్ర ప్రసంగించారు. 11వ సంతానంగా జన్మించిన తాను చదువుకోడానికి వీలు లేని పరిస్థితులను ఎదురొడ్డి, బాల్యవివాహాన్ని తప్పించుకొని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో చేరానని, అక్కడ ఎన్నో అవాంతరాలు కాళ్లకు అడ్డం పడ్డా అస్తిత్వ వాద సాహిత్య అధ్యయనం మునుముందుకు నడిపించిందని సుభద్ర తెలిపారు. మాదిగ స్త్రీలు, వారిని ఆశ్రయించి జీవించే డక్కలి స్త్రీల భాష, సామాజిక ఆర్థిక స్థితిగతులు సాంస్కృతిక అస్తిత్వం ,వారి సమస్యలు చిత్రిస్తూ కథలు, కవిత్వం రాశానని చెప్పారు. దళిత కవయిత్రిగా, రచయితగ్రా, విమర్శకురాలిగా, వక్తగా తగిన గుర్తింపు లభించిందని అన్నారు. సచివాలయంలో ఉన్నతాధికారిణిగా పదవీ విరమణ చేసినా సాహిత్య రంగంలో అట్టడుగు వర్గాల సమస్యలు కథావస్తులుగా రచనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ సాహిత్యంలో బడుగు వర్గాల గొంతు వినిపించిన జూపాక సుభద్ర అభినందనీయురాలన్నారు. ఎన్నో కష్టాలు పడుతూ ఉన్నత స్థితికి చేరడం వెనుక ఆమె కృషి ఆదర్శప్రాయం అన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. కోశాధికారి మంత్రి రామారావు, ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సిల్మా నాయక్ పాల్గొన్నారు.



కాప్రా, మేజర్ న్యూస్.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి సంక్షేమ, రాష్ట్ర హోం,,రెవిన్యూ శాఖ మాజీ మంత్రి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తూళ్ల దేవేందర్ గౌడ్ జన్మదినం సందర్భంగా తెలంగాణ తెలుగు దేశం పార్టీ మల్కాజిగిరి పార్లమెట్ నియెజకవర్గ ఉపాధ్యాక్షులు రాములు యాదవ్ , నీరుకోండు సుతీష్ బాబులు తూళ్ల దేవేందర్ గౌడ్ ను శాలువతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాంక్షంకాలు తెలిపారు.

# వివక్ష లేని సమాజం కోసం

నాంపల్లి, మేజర్‌న్యూస్ : సమాజంపై అవగాహన ఎందరికో ఉండొచ్చు... మార్చాలనే తపన కొందరికే ఉంటుంది. అలా తపించే వారిలో ప్రొఫెసర్ లక్ష్మి ఒకరు. సమానత్వం, వివక్ష లేని మరో సమాజం కోసం నిరంతరం పోరాడుతున్నారు. విద్యార్థి దశ నుంచే హ్యూమనిస్టుగా, యాక్టివిస్టుగా స్త్రీ సమానత్వం కోసం గొంతు విప్పారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి మొదటి మహిళా ప్రిన్సిపల్‌గా చరిత్ర సృష్టించారు. రిటైర్‌మెంట్ తర్వాత కూడా స్త్రీ సమస్యలపై తన పోరాటం ఆపలేదు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్రంలో పెట్రేగుతున్న కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పుతున్న ఆమెతో మానవి సంభాషణ...

ఇటీవల మన రాష్ట్రంలో కులదురహంకార హత్యలు బాగా జరుగుతు న్నాయి. వీటికి కారణం ఏమిటి?

ఇవి గతంలో కూడా ఉన్నాయి. అయితే బయటకు వచ్చే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు మీడియా పెరిగిపోవడం వల్ల బయటకు ఎక్కువగా వస్తున్నాయి. కులం, మతం, మూఢనమ్మకాలు, సంప్రదాయాలు, ఇలా వీటన్నింటి వల్ల తల్లిదండ్రులు, కులపెద్దలు పిల్లల ఇష్టాలను అంగీకరించడం లేదు. రోజురోజుకు సమాజంలో కుల సమస్య పెరిగిపోతుంది. అందుకే ఈ హత్యలు జరుగుతున్నాయి.

ఈ వివాహాల వల్ల అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు?

మొదట తల్లిదండ్రులు ఆమె ప్రేమను అంగీకరించరు. ఇంట్లో వాళ్ళ ఇష్టాన్ని కాదని పెండ్లి చేసుకుంటే ఇల్లు వదిలి వెళ్ళిపోవాలి. సమాజం కూడా అమ్మాయి నిర్ణయాన్ని స్వాగతించదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కరికైనా ఉద్యోగం లేకపోతే బతకడం కష్టం. ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. ఈ ప్రభావం అమ్మాయిలపైనే ఎక్కువగా ఉంటుంది.

అసలు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం అమ్మాయిలకు ఎంత వరకు ఉందంటారు?

ఈ పితృస్వామ్య సమాజంలో ఆడపిల్లతో పాటే ఆంక్షలు, కట్టుబాట్లు కూడా పుడతాయి. ఎలాంటి బట్టలు వేసుకోవాలి?, ఎలా మాట్లాడాలి?, ఏం తినాలి?, ఎంత తినాలి? వరకు అన్నీ ఆంక్షలే. పెండ్లి సంబంధం వస్తే 'ఈ అబ్బాయి నాకు ఇష్టం లేదు' అని అంటే 'నోరుమూసుకో ఇంకెవరికీ చెప్పకు, నీ చెల్లెళ్ళకు పెండ్లి కాదు' అంటారు. రాజ్యాంగం ప్రకారం వివాహానికి సంబంధించి సమ్మతి హక్కు అమ్మాయికి ఉంది. కానీ దాన్ని ఎవ్వరూ పట్టించుకోరు. అమ్మాయికి జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ కల్పించాలి.

తల్లి ఇంటి పేరు, కులం పెట్టుకోవడంలో ఎన్నో ఆటంకాలు ఉన్నాయి. దీని గురించి మీరేమంటారు?

ఏ బిడ్డకైనా తల్లి ఒక వాస్తవం, తండ్రి ఓ నమ్మకం. తొమ్మిది నెలలు మోసిన తల్లి కులం బిడ్డకు వర్తించదంటారు. ఇది సరైనది కాదు. గతంలో స్కూల్లో తండ్రిపేరే అడిగేవారు. కానీ మహిళా ఉద్యమాల ఫలితంగా తల్లిపేరు కూడా చేర్చు కోగ లిగాం. అలాగే ఓ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పిల్లలు తల్లిదండ్రుల కులాల్లో తమకు ఇష్టమైన ఏ కులాన్నైనా పెట్టుకోవచ్చు.

మొదటి నుంచి మానవీయ విలువలతో పెరిగారు. మీ బాల్యం ఎలా గడిచింది?

మాది మిర్యాలగూడ. అక్కడే పుట్టి, పెరిగాను. అమ్మ విరాటమ్మ, నాన్న రామచంద్రయ్య. ఇద్దరూ వ్యవసాయం చేస్తారు. అమ్మ చాలా కష్టపడేది.

మా ఇంట్లో అన్ని కులాల వారినీ సమానంగా చూసేవారు. మేము ఎనిమిది మంది సంతానం. మా అమ్మ చదువు కోలేదు. నాన్న కొద్దిగా చదువుకు న్నారు. కానీ.. సామాజిక అవగాహనతో మమ్మల్ని చదివించారు. అయితే పదో తరగతి పూర్తి కాగానే ఆడపిల్లకు పెండ్లి చేయాలి అని భావించే పల్లెటూరు మాది. నాకూ అలాగే చేయాలనుకున్నారు. అయితే నేను ఒప్పుకోలేదు. స్కూల్ టాపర్ కావడంతో అన్నయ్యలు సపోర్ట్ ఇచ్చి ఇంటర్‌లో చేర్చారు. తర్వాత ఖమ్మంలో మా అన్నయ్య ఇంట్లో ఉండి అక్కడే డిగ్రీ చేశాను. మళ్ళీ ఇంటికి వెళితే పెండ్లి చేస్తారని అటునుంచి అటే స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్ళి పీజీకి ఎన్‌ట్రన్స్ రాశాను. మా ఊరి నుంచి ఎంట్రన్స్ రాసిన వారిలో యూనివర్సిటీలో సీటు వచ్చింది నాకొక్కదానికే. దాంతో ఊళ్ళో అందరూ మెచ్చుకున్నారు. దాంతో అమ్మానాన్నలు గర్వపడ్డారు. నేను ధైర్యం చేసి ఇంటికి వెళ్ళి డబ్బులు తెచ్చుకుని పీజీ పొలిటికల్ సైన్స్‌లో చేరాను. అలా మా కుటుంబంలో ఉన్నత విద్యను చదవిన మొదటి ఆడపిల్లను నేనే.

టీచింగ్‌వైపుకు ఎందుకు వచ్చారు?

పీజీ పూర్తి చేసిన తర్వాత బ్యాంక్ ఉద్యోగం కూడా వచ్చింది. కానీ ఆ టేబుల్ వర్క్ చేయడానికి మనసు అంగీకరించలేదు. ఎమ్‌ఫిల్‌లో చేరాను. తర్వాత 'మహిళా నాయకత్వం' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను. ఎప్పటికైనా అవినీతి ఉండని జాబ్ చేయా లనుకున్నాను. అప్పట్లో అలాంటి జాబ్ టీచింగ్. దాంతో ఇక టీచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాను. ఈ వృత్తిలోకి వచ్చిన తర్వాత యంగ్ టీచర్, బెస్ట్ టీచర్ అవార్డు తీసుకున్నాను. 2002లో ప్రొఫెసర్‌గా, తర్వాత ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించాను.

మరి యాక్టివిస్టుగా ఎలా మారారు?

విద్యార్థినిగా లేడిస్ హాస్టల్ వార్డెన్‌గా బాధ్యతలు చూసేదాన్ని. అక్కడే అనేక విద్యార్థి సంఘాలతో పరిచయాలు ఏర్పడ్డాయి. మా హాస్టల్లో పని చేసే వర్కర్లు ఉండే బస్తీలకు వెళ్ళి వాళ్ళకు అక్షరాలు నేర్పించేవాళ్ళం. యూనివర్సిటీలో ఏ అన్యాయం జరిగినా వ్యతిరేకించేవాళ్ళం. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేసేవాళ్ళం. జెండర్ సమస్యపై, సేవ్ గర్ల్ చైల్డ్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేశాం. ఉమెన్స్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా మరెన్నో కార్యక్రమాలు చేశాం. ముఖ్యంగా అమ్మాయిలకు లీగల్, సోషల్ కౌన్సెలింగ్ ఇచ్చేవాళ్ళం.

మీదీ కులాంతర వివాహమే కదా, ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా?

సమస్యలేమీ లేవు. మా వారి పేరు శివాజీ. ఆయన నాతో పాటు పీహెచ్‌డీలో చేశారు. దండలు కూడా మార్చుకోకుండా రిజిష్టర్ ఆఫీస్‌కు వెళ్ళి సంతకాలు పెట్టి వచ్చేశాం. పెద్దలు మాత్రం రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఆయనా లెక్చరర్‌గా చేసేవారు. అది మానేసి ప్రస్తుతం 'సర్వ్' అనే సోషల్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్నారు. గ్రామాల్లో దళితులు, చెంచుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మాకు ట్రిపులెట్ బేబీస్. ముగ్గురు బాబులు. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసి పై చదువులకు సిద్ధంగా ఉన్నారు.

ఇన్ని బాధ్యతలు నిర్వర్తించారు. మీరెప్పుడైనా జెండర్ సమస్యను ఎదుర్కొన్నారా?

నేను స్ట్రాంగ్. అందుకే నా జోలికి ఎవ్వరూ రారు. అయితే యూనివర్సిటీలో జెండర్ సమస్యలు చాలా ఉన్నాయి. వీటిపై కచ్చితంగా పని చేసేవాళ్ళం. ఇప్పటికీ చేస్తున్నాం.

సరైన గైడెన్స్ ఇస్తే...

మహిళలు ఓ వ్యక్తిత్వంతో పెరగాలి. చదువుకోవాలి. స్వతంత్రంగా బతికే హక్కు ఉంది అని నమ్మాలి. నీ శరీరంపై నీకు హక్కు ఉండాలి. తనలో ఉన్న శక్తిని గుర్తించాలి. నేను ఆడపిల్లను అనే భావనను పక్కన పెట్టాలి. శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండాలి. నా కెరీర్‌లో ఎంతో మంది విద్యార్థులను చూశాను. యువతకు సరైన గైడెన్స్ ఇస్తే మంచి దారిలో వెళతారు. నా దృష్టిలో టీచర్ అంటే పుస్తకాల్లో ఉండేది నాలుగ్గోడల మధ్య చెప్పడం కాదు, సమాజం గురించి, జీవితం గురించి నేర్పాలి. ఉపాధ్యాయులు ఇలా చేయగలిగితే ప్రతి అమ్మాయి, అబ్బాయి ఆణిముత్యాల్లా తయారవుతారు.

### ప్రత్యేక చట్టం కావాలి

దేశంలో సమసమాజం రావాలన్నా, కులర హిత సమాజం ఏర్పడాలన్నా, స్త్రీ-పురుషుల మధ్య అంతరాలు తొలగించాలన్నా కులాంతర వివాహాలు చేసుకునే వారికి కొన్ని అవకాశాలు కల్పించాలి. వీరికి రక్షణ కల్పించే ప్రత్యేక చట్టం కావాలి. ముందు ఆ జంటకు ఆర్థికంగా సహకరించాలి. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. అమ్మాయిలకు ధైర్యం చెప్పాలి. వారి పిల్లలకు అన్నింట్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి. అలాగే భద్రత అనేది కీలకం. కాబట్టి వీరి వివాహాలను రికార్డ్ చేయాలి. అన్నింటి కంటే ముఖ్యంమైనది ఇలాంటి వివాహాల పట్ల సమాజానికి అవగాహన కల్పించాలి.

### విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం

విధాన నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం లేదు. మహిళల సమస్యలంటే సంస్కరణ దృష్టితోనే చూస్తున్నారు. మహిళలకు విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా స్త్రీ సమానత్వం సాధ్యం కాదు. మన రాష్ట్రంలో మంత్రి మండలిలో ఒక్క మహిళకు అవకాశం ఇవ్వలేదు. వీసీలుగా ఒక్క మహిళను తీసుకోలేదు. ఏండ్లు గడుస్తున్నా మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నారు. సమాజంలో సగభాగమైన మనకు అధికారంలో కూడా మన వాటా మనకు రావాలి.

# లక్ష్యం

నాంపల్లి, మేజర్‌న్యూస్ : పడుకున్నవాడు లేచి తిరిగి మళ్లీ పడుకోవడమే జీవితమని కొందరంటున్నారు. 'కలకానిది విలువైనది జీవితం' అన్నాడు.. శ్రీశ్రీ. జీవితం ప్రవాహం, జీవితం నది, జీవితం స్రవంతి. ప్రవాహం నిరంతరం కదులుతుంటుంది. కదలికలేని ప్రవాహం లేదు. నది నిరంతరం చలనంతో ఉంటుంది. అయినా చలించినట్టు కనబడదు. నిరంతరం కదులుతూ కదిలినట్టు కనిపించనిదే జీవితం అంటాడు దాశరథి రంగాచార్య. నది ప్రవాహం జీవనవేగాన్ని సంకేతిస్తున్నది. నీటి పరుగు చైతన్యాన్ని సూచిస్తున్నది. జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్లిపోతూ ఉంది. అందులో ఎవరెవరి సంస్కారాన్ని బట్టి వాళ్లు తమ సుఖం కోసం కొట్లాడుకుంటున్నారు అంటాడు అసమర్థుని జీవయాత్రలో గోపీచంద్. అసలు మనం సక్రమంగా జీవించలేకపోతున్నాం... జీవితంలో అనేకనేక అవకాశాలు మన ముందు కొస్తుంటాయి. అన్నీ ముఖ్యమనిపించినా ఎదురైన ప్రతి అవకాశం అందిపుచ్చుకోలేము. అందుకే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికున్న అవకాశాలను పరిశీలించుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది. నీటి ప్రవాహాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రవాహానికి అడ్డువస్తే నీళ్లు అక్కడే ఆగిపోవు. కొత్తదారి వెతుక్కొని కొండల్లో జలపాతాలుగా రాళ్ల మధ్య పాయలుగా, ఇసుకమేటల్లో ఏర్లుగా ప్రయాణాన్ని సాగిస్తాయి. విద్యార్థి అయితే తాను ఏ వృత్తిలో స్థిరపడదలచుకున్నాడో లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. అందుకనుగుణమైన కోర్సునే ఎంచుకోవాలి. ఊహల్లో విహరించకుండా వ్యూహంతో చదివితే లక్ష్యం సిద్ధిస్తుంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో పేదరికంతో పోరాడుతూ... గోపాలకృష్ణ ఐఏఎస్ లక్ష్యంగా నిర్దేశించుకుని విజయం సాధించిన అనుభవం మన కండ్లముందే కనబడుతున్నది. "ఒక నదిని దాటడం నీ లక్ష్యమైతే.. అందుకు నావగాని, వంతెన గాని లేకుండా నదిని దాటడం సాధ్యం కాదు" అన్నాడు మావో. అంటే లక్ష్యం మంచిదైనా దాన్ని చేరుకోవడానికి నిర్ణయించుకునే సాధనాలపైన జయపజయాలు ఆధారపడి ఉంటాయి. ఏ లక్ష్య సాధనకైనా క్రమశిక్షణ అవసరం. వ్యక్తిగత లక్ష్యాలతో లాభనష్టాలూ కష్టసుఖాలు ఆయా వ్యక్తుల వరకే పరిమితం అవుతాయి. అదే మన సమాజానికి బాధ్యత వహించినప్పుడు సమిష్టి లక్ష్యంగా మారుతుంది. తప్పుడు లక్ష్యాల వల్ల మనమే కదా నష్టపోయేది అనుకుంటే కుదరదు. దాని ప్రభావం మొత్తం సమాజంపైనా ఉంటుంది. లక్ష్యాలు ఉన్నతమైనవైతే సాధనఎలాంటివైనా పరవాలేదా? శంకరాచార్యుడు జీవాత్మ - బ్రహ్మాత్మల ఏకత్వాన్ని తెలుసుకోవడమే లక్ష్యం అన్నాడు. ఇందుకు జ్ఞాన సంపాదన మార్గమన్నాడు. వీరు వాస్తవ జీవితంతో సంబంధం లేని లక్ష్యాన్ని ఎంచుకున్నారు.

కమ్యూనిస్టుల దృష్టిలో జీవిత లక్ష్యం మానవజాతి సుఖసంపదలతో జీవించడం. భౌతికంగానూ, సాంస్కృతికంగానూ అంతకంతకు ఉన్నత శిఖరాలకు అందుకోవడం. ప్రతి మానవుడు తోటి వారితో కలిసి మానసిక శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి అంతకంటే ఎక్కువ స్వేచ్ఛ సంపాదించడం. పరాయి పాలనకు స్వస్తిపలికి స్వాతంత్ర్యం సాధించుకునేందుకు భారత ప్రజలు శత సంవత్సరాలు పోరుసల్పారు. ఈ వందేండ్ల స్వాతంత్ర్య పోరాటం మన లక్ష్యంగా ఉన్నది. లక్ష్యం మహోన్నతమైనదని అందరూ అంగీకరించారు. ఏకాభిప్రాయానికి వచ్చారు. కానీ సాధన మార్గం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. అహింసను జీవిత లక్ష్యంగా పెట్టుకున్న గాంధీ మహాత్ముడే పిరికితనంతో బానిస జీవితం గడపడం కన్న దౌర్జన్యంతో శత్రువును ప్రతిఘటించడం మంచిదన్నాడు. ఉరితీయబడ్డ భగత్‌సింగ్ దేశభక్తిని పొగుడుతూనే అతడు ఎంచుకున్న మార్గం సరైనది కాదంటూ గాంధీజీ పెట్టిన తీర్మానం కాంగ్రెస్‌లో వీగిపోయింది. ఆ కాలంలో దేశం కోసం పోరాడి అమరులైన వారందరు వీరులుగా కీర్తింపబడ్డారు. స్వాతంత్ర్యం సిద్ధించింది. అప్పుడు ఏంచేయాలి అనే ప్రశ్న ముందుకు వచ్చింది. ఒక సమస్యను పరిష్కరిస్తే ఆ సమస్య పరిష్కారంలో మరొక సమస్య పుట్టుకొస్తుంది. ఒక గమ్యాన్ని చేరుకొని అక్కడే ఆగిపోవడం కాదు. ఎప్పటికప్పుడు సమస్త అవకాశాలను వినియోగించుకుంటూ నూతన లక్ష్యాలను చేరుకోవటం. విజయాల మీద విజయాలు సాధిస్తూ కొనసాగించే అనంతయాత్ర, అట్టి యాత్రలో ప్రతిలక్ష్యం ఒక మజిలీ, మరొక లక్ష్యాన్ని సాధించడానికి అదొక ప్రారంభం. నూతన లక్ష్యాలను నిర్దేశించుకునేటప్పుడు మన మార్గం, గమ్యాన్ని బట్టీ పరిస్థితులను బట్టీ కూడా ఉంటుంది. గమ్యాన్ని మరచిపోతే కోరిన లక్ష్యం కాక విరుద్ధమైన ఫలితాలు వస్తాయి. భారత రాజ్యాంగంలో సోషలిజం లక్ష్యంగా ప్రకటించారు. దాన్ని సాధించాలంటే పెట్టుబడిదారీ పద్ధతులు ఎన్నటికీ పనికిరావు. నెరవేరని లక్ష్యాలు పెట్టుకుంటే ఎవరైనా కొంత కాలానికి గందరగోళంలో పడిపోతారు. భవిష్యత్తు చీకటిగా మారుతుంది. మనిషి సంఘ జీవితాన్ని నియంత్రించటానికి రాజ్యం ఏర్పడింది. అది ఏది చెయ్యాలి, ఏది చేయకూడదో చెబుతుంది. అది ఎక్కువ మందిని బాధపెట్టే స్థితికి వస్తుంది. ఆ బాధలు ఏంచేస్తే పోతాయో లక్ష్యం నిర్ణయించుకోవాలి. బాధలు లేని సమాజం కోసం పాటు పడాలి. ఏదీ తనంత తానై నీదరికిరాదు శోధించి సాధించాలి అదే ధీరగుణం అంటాడు శ్రీశ్రీ. అందుకే ఆదర్శ సమాజ నిర్మాణానికి అందరం అంకితమవుదాం. అలిశెట్టి ప్రభాకర్ అన్నట్టు అన్నం ముద్దలాంటి ఆశయాన్ని అందరం కలిసి, పంచుకుందాం. యుద్ధరంగమైన జీవితాన్ని ఒక్కటిగానే ఎంచుకుందాం.

# జీఎస్‌టీ

నార్కట్‌పల్లి, మేజర్‌న్యూస్ : జీఎస్‌టీ అమలుతో పేదలకు లాభం జరుగుతుందని చెప్పిన మోడీ అమెరికాలో 20 టాప్ కంపెనీల సీఈఓల సమావేశంలో వస్తుసేవల పన్ను సంస్కరణలు చేశామనీ, భారత పన్నుల విధానం అమెరికా బిజినెస్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చవచ్చునని ప్రచారం చేస్తున్నారు. మనదేశ భక్తులు బడుగుల నెత్తిమీద చెయ్యిపెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. మోడీ ద్వంద్వ నీతి బట్టబయలైంది.

కేంద్ర ప్రభుత్వం వస్తుసేవల పన్ను ప్రారంభాన్ని ఒక పెద్ద ఘనకార్యంగా భావిస్తోంది. కేంద్ర పన్నుల విధానానికి వ్యతిరేకంగా వస్త్ర వ్యాపారులు బంద్ పాటించారు. వివిధ రకాల నిరసనలు తెలువుతున్నారు. వస్త్ర పరిశ్రమలో వెయ్యి రూపాయలు విలువగల వస్త్రాలు కొంటే ఒక పన్ను విధానం, దాటితే మరొక పన్ను విధించటం వల్ల పన్నులు భారంగా పరిణమించనున్నాయి. ముఖ్యంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి జీఎస్‌టీ భారంతో చేనేతరంగం మరింత రక్షణ లేకుండాపోయే ప్రమాదం ఉంది. బీడీ పరిశ్రమ దివాళా తీసి లక్షలాదిమంది బీడీ కార్మికులు ఉపాధిలేక రోడ్డున పడతారు. పాత పన్నుల విధానంలో 18శాతం పన్ను చెల్లిస్తున్నారు. ఇప్పుడు 28శాతానికి పెరగడం వలన అమ్మకాలు పడిపోతాయి. పరిశ్రమలు మూతపడతాయి. కాబట్టి బీడీ పరిశ్రమను జీఎస్‌టీ నుండి మినహాయించాలనే కోరిక సమంజసమైనదే. ఒకప్పుడు పాలకులు చిన్న పరిశ్రమలను పెద్ద పరిశ్రమల పోటీ నుండి కాపాడేందుకు ప్రత్యేకమైన పన్ను రాయితీలు ఇచ్చేవారు. ఇప్పుడు టర్నోవర్‌ను నామమాత్రంగా పెంచి పన్ను భారాల నుండి మినహాయింపు లేకుండా చేశారు. పన్నుల భారం, కార్పొరేట్ సంస్థల పోటీ తట్టుకోలేక పరిశ్రమలు మూతపడతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు జీఎస్‌టీ అమలు వలన లక్షల ఉద్యోగాలు వస్తాయని ఊదరగొడుతున్నారు. పాలకులు నిరుద్యోగులను భ్రమలకు గురిచేస్తున్నారు.

దేశంలో ఇప్పటికి 60శాతం మందికి పైగా వ్యవసాయం మీద ఆధారపడి పనిచేస్తున్నారు. ఈ రంగం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. పంటలకు గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జీఎస్‌టీ వ్యవసాయ రంగాన్ని కూడా విడిచిపెట్టలేదు. గతంలో అన్ని రకాల ఎరువుల మీద వ్యాట్ 5శాతం మాత్రమే ఉండేది. వస్తుసేవల పన్నులు అమలు అయితే అదనంగా 7శాతం పన్ను పెరుగుతుంది. అదే స్థాయిలో ఎరువుల ధరలు కూడా పెరుగుతాయి. క్రిమి సంహారక మందుల మీద 18శాతానికి పన్నులు పెరుగుతాయి. గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఇప్పుడు జీఎస్‌టీ పన్నుల వలన రైతు నెత్తిన అప్పులు పెరుగుతాయి. ప్రజలెవ్వరూ కోరకుండా పన్నుల విధానాలలో పాలకులు మార్పులు ఎందుకు చేస్తున్నారు? అసలు దేశమంతా ఒకే పన్ను పద్ధతి పాటించాలని ఎవరు బలవంత పెట్టారు? కేంద్ర పాలకులు కార్పొరేట్ శక్తుల పంచన చేరారు. ముందు రిలైట్ రంగంలో సంస్కరణలు చేశారు. వాల్‌మార్ట్ లాంటి సంస్థలకు స్వదేశీ గుత్త సంస్థలకు తలుపులు తెరిచారు.

కార్పొరేట్ పంజరంలో చిక్కిన అధికార పార్టీ చిలుకలు ఒకే దేశం ఒకే పన్ను ఉండాలనే చిలుక పలుకులు పలికారు. ప్రజలకు లాభం జరుగుతుందని ప్రచారం చేశారు. ఏకాభిప్రాయ సాధన పేరుతో అనేక ప్రయత్నాలు చేసి, పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారా ఒకే పన్ను ఆమోదింపజేసుకున్నారు. ఫెడరల్ వ్యవస్థపై వేటు వేశారు. గతంలో పన్నుల వ్యవస్థ కేంద్రం చేతిలో ఉండాలా రాష్ట్రం చేతిలో ఉండాలా అని రాజ్యాంగ నిర్మాతలు చర్చించి ప్రత్యక్ష పన్నులు కేంద్రం, పరోక్ష పన్నులు రాష్ట్రాలకు హక్కు భుక్తం చేశారు. ఒకే పన్ను విధానం రావడంలో కేంద్రం ముందు రాష్ట్రాలు సాగిలపడే పరిస్థితి వచ్చింది. వస్తుసేవల పన్నును నిర్ణయించడానికి జీఎస్‌టీ కౌన్సిల్ ఏర్పడింది. గతంలో పరోక్ష ప్రత్యక్ష పన్నుల వసూలు ఉండేది. ఇప్పుడు మొత్తం పన్నులను మూడు కేటగిరీలుగా విభజించి పన్నులు వేయాలని నిర్ణయించారు. జీఎస్‌టీ సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రి తారక రామారావు కొత్తచట్టం వలన రూ. 11వేల కోట్ల భారం తెలంగాణపై పడుతుందని తెలిపారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఇన్ని భారాలు పడితే దేశ ప్రజలపై ఎంత భారం పడుతుందో తలుచుకుంటేనే కడుపు తరుక్కుపోతోంది. ముందూ వెనకా ఆలోచించకుండానే టీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రం అడిగిందే తడవుగా జీఎస్‌టీని ఆమోదించిన ఫలితంగా ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు పడుతున్నాయి. వస్తుసేవల పన్ను విధానంలో మార్పులు జరగాలంటే కేంద్రానికి ఇష్టం లేకుండా ఏదీ జరగదు.

# ఎండిన పంటలు పరిశీలించిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే



నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : పంటలు ఎండిపోయి రైతులు బోరున విలపిస్తున్నా పట్టించుకోని అసమర్ధ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని మండిపడ్డారు మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి నల్గొండ మండలం అన్నపర్తి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డితో కలిసి ఎండిన పంట పొలాలను, నిమ్మ తోటలను జగదీష్ రెడ్డి పరిశీలించారు. అన్నదాతలతో ముచ్చటించి, వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. మూసి ప్రాజెక్టు కింద నీరు అందించే అవకాశం ఉన్న ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నాగార్జునసాగర్ ఆయకట్టులో కూడా ఎగువ ఉన్న నారాయణపురం, ఆల్మట్టి డ్యామ్ లనుండి నీటిని తెప్పించి రైతులకి అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏ గ్రామానికి వెళ్ళిన ఎండిన పంట పొలాలే దర్శనమిస్తున్నాయని, పెట్టుబడులన్నీ మట్టిలో కలిసిపోయి రైతులు విలపిస్తున్నారని అన్నారు. ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే ,అధికారులు కూడా రైతుల వంక కన్నెత్తి చూడట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.. కాంగ్రెస్ మంత్రులకు రాజకీయాలు, అక్రమ వసూళ్లు, దందాలు తప్ప ,రైతుల గోడు పట్టట్లేదని అన్నారు. జిల్లా మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌లు ఉత్తర కుమారులని, ప్రగల్భాలు పలకడం తప్పా దేనికి పనికిరారని అన్నారు. వారుకి ఎంతసేపు రాజకీయాలు చేయడం తప్ప రైతుల సంక్షేమం పట్టలేదని అన్నారు... కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య పూరిత వైఖరితో రైతులు మరింత అగాధంలోకి వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి కరువుపై సర్వే చేయించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ఉసురు తగిలి కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, నల్గొండ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, నాయకులు, చెరుకు సుధాకర్, పంకజ్ యాదవ్, దీప వెంకట్ రెడ్డి యాదయ్య గౌడ్, నాగరాజు, దేవేందర్, లింగుస్వామి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మూసి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి



మోత్కూర్, మేజర్‌న్యూస్ ః మూసి కాలుష్య నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూసీనది కాలుష్య సమస్యలపై నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఇట్టి విషయంపై మాట్లాడినట్టు విలేకరులకు తెలిపారు. బీమాలింగం కాల్వ ద్వారా వెల్వర్తి, పల్లెర్ల, కూరెళ్ల, పాలడుగు, దత్తప్పగూడెం, పొడిచేడు గ్రామాల వరకు మూసి కలుషిత నీరు వస్తుందని తెలిపారు. మూసీ నీరులో వ్యర్థాల కలుషితం కారణంగా పండించిన పంటలు, చెరువులోని చేపలు, పశుగ్రాసం, త్రాగునీరు లాంటివి కాలకూట విషంగా మారుతున్నాయని అన్నారు. భూగర్భజలాలు కలుషితం కార ణంగా ప్రజలు అనారోగ్యం పాలై అనేక రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మూసి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. బస్వాపురం ప్రాజెక్ట్ ద్వారా పైల్వాన్‌పురం చెరువును మినీ రిజర్వాయర్‌గా చేసి వెల్వర్ధి, పల్లెర్ల, కూరెళల, పాలడుగు చెరువులకు గోదావరి జలాలను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మున్సిపల్ చైర్మన్ పొతంశెట్టి వెంకటేశ్వర్లు



భువనగిరి మేజర్‌న్యూస్ః భువనగిరి పట్టణంలోని ముస్లీం మైనార్టీల స్మశాన వాటికకు గేటు లేదని ముస్లీం పెద్దలు గత 10 రోజుల క్రితం భువనగిరి మున్సిల్ చైర్మన్ పొతంశెట్టి వెంకటేశ్వర్ల దృష్టికి తీసుకుపోగా,అందుకు చైర్మన్ తప్పకుండ గేటును బిక్షించడం జరగుతుందని హమీ ఇచ్చారు.ఇచ్చిన హమీ మేరకు 10 రోజుల తరువాత నూతన గేటును స్మశాన వాటికకు బిగించినారు.ఈ సందర్భంగా ముస్లీం పెద్దలు మరియు నాయకులు గేటు బిగించిన చైర్మన్ పొతంశెట్టికి ధన్యవాధంలు తెల్పారు.భువనగిరి అబివృద్ధి పనులలో త్వరగా చొరువ చూపుతున్న చైర్మన్ ప్రజల మనస్సులను చూరగొంటున్నారని తెల్పారు.

# ఎమ్మెల్యే కుంభం సమక్షంలో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరిక



భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో సోమవారము బిఆర్ఎస్ పార్టీ నుండి పలువురు పోచంపల్లి మండలము మరియు మున్సిపాలిటీకి చెందిన నాయకులు పద్మశాలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తడక రమేష్, కౌన్సిలర్ దారెడ్డి మంజుల వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, మైల అయిలయ్య, కోయడ శ్రీనివాస్ గౌడ్,మద్ది మదుసూదన్ రెడ్డి, ఎలగందుల నరసింహ,ఎడ్ల లింగస్వామి, మాజీ సర్పంచ్ టి.వెంకటేష్, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీలతా మదుసూదన్, పెద్దల బాలయ్య,కొట్టం ప్రకాష్ రెడ్డి, కొట్టం వేమన్ రెడ్డి, కొట్టం శ్రీనివాస్ రెడ్డి, గుత్త శేఖర్, కొమరెల్లి ప్రతాప్ రెడ్డి, సుమారు 150మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, మండలపార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నరసింహ రెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, రాఘవ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు అవగాహన సదస్సు, చైతన్య కార్యక్రమం



చివ్వెంల మేజర్ న్యూస్ః రాబోవు పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సజావుగా ఎన్నికలు జరగడానికి జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని చివ్వెంల, బండిమీద చందపట్ల గ్రామాల్లో 50 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బంది, చివ్వెంల పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి ఈ రెండు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగినది, ఇట్టి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో ట్రైనీ ఐ.పి.ఎస్. రాజేష్ మీనా, వై. సురేందర్ రెడ్డి, సి.ఐ. బి. వెంటక్‌రెడ్డి, ఎస్సై వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వామివారిని దర్శించుకున్న నేషనల్ డిఫెన్స్ బృందం





యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : నేషనల్ డిఫెన్స్ కాలేజీ, నూఢిల్లీ ద్వారా దేశ, విదేశాలకు చెందిన 16 మంది మెంబర్ల బృందం మేజర్ జనరల్ ఎ.కె.సింగ్ ఆధ్వర్యంలో " స్టడీ టూర్ ఎకనామిక్ సెక్యూరిటీ " కార్యక్రమం క్రింద తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం యాదాద్రి శ్రీ లక్ష్మినరసింహ్మా స్వామి వారిని దర్శించుకుంది. జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే, డిప్యూటీ పోలీసు కమీషనర్ రాజేశ్ చంద్ర వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, యాదగిరిగుట్ట దేవస్థానం కార్యనిర్వహణ అధి కారి ఎ.భాస్కరరావు, భువనగిరి ఆర్.డి.ఓ.అమరేందర్, అధికారులు పాల్గొన్నారు.

# రజక సంఘానికి కూడా కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

## రజక సంఘం జిల్లా నాయకులు చిలకరాజు శ్రీను ప్రభుత్వానికి విజప్తి



నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ ః ఇటీవల తెలంగాణలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కార్పోరేషన్‌లను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అలాగే రజకులకు కూడా కార్పోరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని సూర్యాపేట జిల్లా రజక సంఘం నాయకులు చిలక రాజు శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నాడు ఆయన నేరేడుచర్లలో రజక సంఘం నాయకులు కొమ్మరాజు వెంకట్‌తో కలిసి విడుదల చేసిన పత్రిక ప్రకటనలో సమాజంలో అత్యంత వెనుకబడిన రజకులను ఆదుకోవడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిజానికి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి వారికి సామాజికంగా ఆర్ధికంగా పాలకులు అండగా నిలబడాల్సిన ఈ తరుణంలో అసలు రజకులకు కార్పోరేషన్ లేకుండా చేయటం బాధాకరమని, తరతరాలుగా రజకులు వివక్షతకు గురవుతున్నారన్నారు. రజకుల కార్పోరేషన్ కొరకు రాష్ట్రం, జిల్లా వ్యాప్తంగా ఉన్న రజకులు మౌనం వీడి రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని రజకుల మధ్య ఐక్యత లేకపోవడం వల్లనే రజకుల కార్పోరేషన్ ఏర్పాటు చేయలేదన్న విషయాన్ని ప్రతి రజకుడు గమనించుకోవాలని అన్నారు. ఆయన వెంట రజక సంఘం నాయకులు చిలకరాజు సైదులు, సట్టు వీరయ్య, రెడ్డిపల్లి వినయ్, రెడ్డిపల్లి నాగరాజు, చిలక రాజు, నాగరాజు, సట్టు నాగమణి, భువనగిరి నాగలక్ష్మి, కోమ్మరాజు లక్ష్మి దంపతులు ఉన్నారు.